నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

10 | మహబూబ్‌నగర్, గురువారం 20 మార్చి 2025 | MAHABUBNAGAR NARAYANPET

అంకెల గారడీగా బడ్జెట్

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెలగారడిగా ఉంది. రూ.3,04,965 కోట్ల బడ్జెట్‌తో రాష్ట్రంలోని ప్రజానీకాన్ని మరోసారి కాంగ్రెస్ మోసం చేసేందుకు సిద్ధమైంది. బడ్జెట్ క్షుణ్ణంగా పరిశీలిస్తే పరోక్షంగా కాంగ్రెస్ నాయకులు జేబులు నింపుకొనేందుకు ఉన్నంది. రైతు సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్‌లో రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతుభరోసా చేయకుండా కోతలు పెట్టేందుకు అవకాశం ఉంది. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్మాణం రంగంపై బడ్జెట్ ప్రణాళిక కనవబడడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంపదను సృష్టించే విధంగా గత బడ్జెట్‌లను ప్రవేశపెడితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సంపదను కార్యకర్తలకు పంచిపెట్టే విధంగా బడ్జెట్ రూపొందించినట్లు ఉంది. కొల్లాపూర్ ప్రాంతంలోని మినీలిఫ్టులతోపాటు సాగునీటి రంగానికి, కొల్లాపూర్ ప్రాంతంలో రాష్ట్ర సాంకేతిక విద్యాసంస్థలకు నిధులు కేటాయించలేదు.

- హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కొల్లాపూర్

అసెంబ్లీ సాక్షిగా అబద్ధాల చిట్టా..

• మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపర్తి, మార్చి 19(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అబద్దాల చిట్టాగా ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన వికాసాన్ని 15నెలల కాంగ్రెస్ పాలనలో చిద్రం చేశారని విమర్శించారు. బుధవారం ప్రవేశపెట్టిన రేవంత్ సర్కార్ బడ్జెట్‌పై స్పందించారు. ఒక మధ్యంతర బడ్జెట్‌తో కలిపి కాంగ్రెస్ ప్రభుత్వం మూడో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలన గడువక ముందే ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, 2050 తెలంగాణ రైజింగ్ ప్రణాళిక తయారు చేస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో తెలంగాణలో జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుతో పాలన వికేంద్రీకరించబడిందని, అన్నిర కాల వనరులను సమీకరించుకొని దేశంలోనే తలసరి ఆదాయంలోనూ, విద్యుత్ వినియోగంలోనూ నెంబర్‌వన్‌గా నిలిచిందని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యా, వైద్య రంగాల్లోనూ అనూహ్య మార్పులు, ప్రాజెక్టుల నిర్మాణం, సాగునీటి సదుపాయాల కల్పన మూలంగా పంటల ఉత్పత్తిలో తెలంగాణను అగ్ర భాగాన కేసీఆర్ నిలిపింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పచ్చబడగొట్టిన తెలంగాణను ఎండబెట్టి కాంగ్రెస్ చోద్యం చూస్తున్నదని, ప్రతిఇంటికి నల్లా నీటితో పరవశించిన ఆడపడుచులు.. మళ్లీ నేడు బిందెలు చేతిలో పట్టుకొని పరుగులు తీసే పరిస్థితిని కాంగ్రెస్ కల్పిస్తున్నదని విమర్శించారు. పట్టణ ప్రగతి.. పల్లెప్రగతి కార్యక్రమాలతో కళకళలాడిన పట్టణాలు, పల్లెలు నేడు పారిశుధ్యం లోపించి కంపు కొడుతున్నాయన్నారు. హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయని, పచ్చని పార్కులు పడావుగా మారాయన్నారు. పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్‌ల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల వరకు ఆశలపల్లికిలో ఊరేగించే అంధఃపాతాళానికి కాంగ్రెస్ విసిరేసిందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ ఆశ చూపి రైతులను మోసం చేశారని, ఎకరాకు ఏడాదికి రూ.15వేల రైతుభరోసా అంటూ అన్నదాతలను దగా చేశారన్నారు. కూలీలకు రూ.12వేలు, కౌలు రైతులకు ఏడాదికి 15వేలు, ఏడాదిలో రూ.2లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని చెప్పిన హామీలన్నీ నేటికి మొదలు కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ పాపాలతో రాష్ట్రంలో 450మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని, గురుకుల విద్యాలయాల్లో మరో 50మందికి పైగా విద్యార్థులు వివిధ కారణాలతో మరణించారని దుయ్యబట్టారు. కేవలం రూ.15నెలల పాలనలో రూ.లక్షా 50వేట్లు అప్పు చేసి ఏ ఒక్క పథకాన్ని అమలు చేయడం కానీ, ప్రాజెక్టును పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు. రేవంత్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను అబద్దాలతో వండి వార్చారని, ధ్వంసం, విధ్వంసాన్ని కాంగ్రెస్ రచిస్తే.. తెలంగాణ నవనిర్మాణాన్ని నరనరాన నింపుకొని కేసీఆర్ ప్రభుత్వం పని చేసిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి విమర్శించే నైతికహక్కు లేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీవి 420 హామీలు

• కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



కల్వకుర్తి, మార్చి 19 : కాంగ్రెస్ పార్టీవి 420 హామీలని.. అబద్దపు హామీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎద్దేవా చేశారు. కేవలం అధికారం కోసం మోసపూరితంగా హామీ లిచ్చిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను నిలువుగా మోసం చేశారని దుయ్యబట్టారు. అబద్దపు హామీల ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోనున్నారని విమర్శించారు. బుధవారం అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీసీ సంక్షేమానికి రూ.9వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి పైసా ఖర్చు చేయకుండానే 2025-26 ఆర్థిక సంవత్సరంలో బీసీ సంక్షేమానికి రూ.11వేల కోట్లు పెట్టామనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ తప్పా ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేది కాదని పేర్కొన్నారు. అలవిగాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడం చేతకాక సీఎం రేవంత్‌రెడ్డి నిండుసభలో ప్రభుత్వం వద్ద నిధులు లేవని నిస్సిగ్గుగా అనడం చూస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం దివాళా తీసిందనడానికి ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. బడ్జెట్ రైతులు, వృద్ధులు, వితంతువులకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా ఉందని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నో ప్రజా, రైతు సంక్షేమ పథకాలకు మంగళంపాడిన ఘనత రేవంత్ ప్రభుత్వానికి దక్కుతుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కాకుండా ఢిల్లీ పెద్దలకు డబ్బుసంచులు మోసే గులాంగిరి బడ్జెట్‌గా అభివర్ణించారు. కాంగ్రెస్ కమీషన్ల ప్రభుత్వంగా పేరుగాంచిందన్నారు. హైడ్రా పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ కమీషన్లను వసూలు చేస్తున్న ఘనత వారిదేనన్నారు. సంచలనం రేపిన ఎస్ఎల్‌బీసీ విపత్తు గురించి అసెంబ్లీలో చర్చించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.



పాలమూరుకు మళ్లీ మొండిచేయి!

రూ.20 వేల కోట్లు ఏవీ రేవంత్..!?

మహబూబ్‌నగర్, మార్చి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మా ఉప ముఖ్యమంత్రి అడుగుతున్నా.. మా ఇన్‌చార్జి మంత్రి దామోదర్ అన్నను కోరుతున్న.. సహచర మంత్రులు కూడా ఇక్కడున్నారు.. మా పాలమూరు అభివృద్ధికి ఏటా రూ.20వేల కోట్లు ఇవ్వండి.. ఈ ఐదేండ్లలో రూ.లక్ష కోట్లు అయితయి.. జిల్లా అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా.. మీ తరపున అందరినీ అడుగుతున్నా.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన రైతుపండుగలో మాట్లాడిన మాటలివి.. ప్రతిఏటా రూ.20వేల కోట్లతో జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడతారని అందరూ మంత్రుల సాక్షిగా ఇచ్చిన మాట నీటి మూటేనా అంటూ ఉమ్మడి జిల్లా ప్రజలు నిలదీస్తున్నారు. బుధవారం రాష్ట్ర శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా అభివృద్ధి నిధుల ఊసే లేకపోవడంతో జిల్లా ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. నేను మీ బిడ్డను.. ఈ జిల్లా అభివృద్ధికి మీరంతా అడిగితే మా మంత్రులు ఇవ్వరా కొట్టండి చప్పట్లు అంటూ కొట్టించి చివరకు బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించకపోవడం.. మా చప్పట్లన్నీ వృథా అయ్యాయని మండిపడుతున్నారు. పాలమూరు జిల్లా వరప్రదాయిని అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపించింది. బడ్జెట్‌లో ఆశించినంత కేటాయించకపోవడంతో ఈ ప్రాజెక్టు పనులు ఈసారి కూడా నిలిచిపోయే అవకాశాలున్నాయి. ఈ పథకంలో భాగంగా ఉదండాపూర్ జలాశయం కింద రైతులు పరిహారం కోసం పరితపిస్తుంటే రూపాయి కూడా కేటాయించలేదు. సీఎం మానస పుత్రిక అయిన కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి కూడా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాలో మిగతా ప్రాజెక్టులకు మెయింటినెన్స్ నిధులు తప్పితే ఇతర పద్ధతులు ఏమీ కేటాయించకపోవడంతో రైతాంగం తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తుంది. ఒక్క కల్వకుర్తికి తప్పితే కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు ఇతర ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం మెయింటినెన్స్ ఖర్చులు మాత్రమే పద్దుల్లో చూపింది. ప్రభుత్వమిచ్చిన ఆరు గ్యారెంటీల ఊసే లేకపోవడంతో మహిళలు మండిపడుతున్నారు. యువతకు కూడా జీవనభృతి కల్పించే అంశంపై కూడా బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా యువత నిరాశ చెందుతోంది. దివాళాకోరు బడ్జెట్ అని బీఆర్ఎస్ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పాలమూరుకు మళ్లీ మొండిచేయి

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో 12లక్షల ఎకరాలకు నీరందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేవలం రూ.2547 కోట్లు మాత్రమే కేటాయించారు. సంగెంబండ, కోయిల్‌సాగర్, భీమా లిఫ్ట్ టు.. నెట్టెంపాడు ప్రాజెక్టులకు మెయింటినెన్స్ ఖర్చులు మాత్రమే కేటాయించినట్లు సమాచారం. ఇతర ప్రాజెక్టులకు చిల్లిగవ్వ కేటాయించలేదు. ఎన్నో రోజులుగా జడ్చర్ల మండలం ఉదండాపూర్‌లో పునరావాస ప్యాకేజీకి ఆందోళన చేస్తున్న వారికి బడ్జెట్‌లో ఊరట కల్పించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

20వేల కోట్లు ఏమయ్యాయి?

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20వేల కోట్లు కేటాయిస్తామని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రుల సాక్షిగా ప్రకటించారు. కానీ బడ్జెట్‌లో మాత్రం ఈ ఊసే కనిపించడం లేదు. అందరూ మంత్రులు వేదికపై ఉండగా.. వారిని జిల్లా ప్రజల తరపున అడుగుతున్నానని చెప్పి జనం సాక్షిగా చప్పట్లు కొట్టించారు. దాదాపు 5నిమిషాలు చప్పట్లు కొట్టించి బడ్జెట్‌లో చిల్లి గవ్వ కేటాయించకపోవడంతో జిల్లా ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈ జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ బడ్జెట్‌లో తగిన న్యాయం జరగలేదని ఆరోపిస్తున్నారు.

ఆరు గ్యారెంటీలకు నో గ్యారెంటీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించకపోవడంతో తీవ్ర నిరాశ కలుగుతుంది. మహిళలకు కనీసం నెలకు 2500 భృతి, పింఛన్లు 4000 అవుతాయని ఆశపడ్డవారికి నిరాశే మిగిలింది. ఈ బడ్జెట్‌లో ఈ స్కీములకు డబ్బులు కేటాయించలేకపోవడంతో ఈ ఏడాది కూడా అమలు అసాధ్యమేనని తెలుస్తోంది. రైతుభరోసా పథకానికి కూడా మంగళం పాడే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు అంతంతమాత్రంగానే ఉన్నాయని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా యువకులకు నిరుద్యోగ భృతి విషయంలో కూడా భరోసా కల్పించలేదని యువజన సంఘాలు విమర్శిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని.. వడ్డించేవాడు మనోడైనా నిధులు తేవడంలో ఎమ్మెల్యేలు విఫలమయ్యారని విమర్శలు వస్తున్నాయి.

- ఉమ్మడి జిల్లాకు నిరాశ జనకంగా రాష్ట్ర బడ్జెట్
- మహిళలు, యువకులకు గుండు సున్నా..
- అంతంతగానే ప్రాజెక్టులకు కేటాయింపులు
- చర్చకురాని నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలు
- ఉదండాపూర్ పరిహారం ఊసెత్తని వైనం
- దివాళాకోరు తనానికి నిదర్శనమంటూ విమర్శలు

దివాళాకోరు తనానికి నిదర్శనం

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ దివాళ కోరు తనానికి నిదర్శనం. జిల్లాలోని కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి కూడా ఎలాంటి కేటాయింపులు లేవు. అంతేకాకుండా మిగతా ప్రాజెక్టులకు కూడా అంతంత మాత్రమే నిధులు కేటాయించారు. బడ్జెట్‌లో నిధులు రాబట్టడంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారు. నియోజకవర్గాలకు కూడా సరైన నిధులు రాబట్టలేకపోయారు.

- చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మక్తల్

మైనార్టీలకు తీవ్ర నిరాశనే మిగిలింది



ముఖ్యమంత్రి మైనారిటీలకు సబ్‌ప్లాన్ అని చెప్పారు. కేవలం రూ.3500 కోట్లు మాత్ర మే మైనారిటీలకు కేటాయించారు. అదికూడా అంకెలు చూపించుకోవడానికి మాత్రమే. మైనారిటీలను మరోసారి కాం గ్రెస్ సర్కారు మోసం చేసింది. బడ్జెట్‌లో రూ.3500కోట్ల సంఖ్య చూపెట్టినా గతేడాది ఖర్చు చేసింది కేవలం వెయ్యి కొట్లే. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల కోసం ఏ కొత్త పథకం పెట్టలేదు. తెలంగాణ మైనార్టీలు గమనించాలి. సబ్సిడీ అన్నారు.. దానిక్కూడా బ్యాంకుతో లింక్ పెట్టారు. ఇప్పటివరకు ఇమాం మౌజంలకు గౌరవ వేతనం పెంచలేదు. రంజాన్ పండుగ వచ్చిన కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదు.

- ఇంతియాజ్ ఇసాక్, మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్

విద్యారంగంపై వివక్ష.. నిధుల కేటాయింపులో కక్ష

తెలంగాణ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రకటించిన బడ్జెట్‌లో విద్యారంగంపై కాంగ్రెస్ పార్టీ వివక్ష చూపెడుతూ చాలా తక్కువ నిధులు కేటాయించింది. ఏదైనా ప్రాం తం అభివృద్ధి చెందాలంటే విద్య మూలకారణం. విద్యతోపాటు వైద్యానికి కూడా ప్రాధాన్యత ఉంటుంది. విద్య, వైద్యరంగంపై కాంగ్రెస్ ప్రకభుత్వం దృష్టి సారించడంలేదు. అవసరమైన రంగాలకు నిధులు కేటాయించకుండా అనవసరమైన రంగాలకు నిధులు కేటాయిస్తోంది. అధికారం కోసం అమలు చేయలేని ఆరు గ్యారెంటీలను ప్రజలకు ఆశచూపి అధికారంలోకి వచ్చాక పాలనపై చిత్తశుద్ధి లేదని నిరూపించుకుంది. కేసీఆర్ పాలనలో విద్యారంగానికి పెద్దపీట వేసి ఉండే. కాంగ్రెస్ పార్టీ కేవలం అధికారం కోసమే పా కులాడుతుంది. ప్రజాపాలన కోసం కాదని స్పష్టమైంది. ఉచితాల పేరు తో రూ.వేల కోట్ల రూణాలు అ ప్పులు తెచ్చి తెలంగాణ రా ష్ట్రాన్ని అప్పుల కూపం లో ముం చింది. రాష్ట్ర బడ్జెట్‌పై ప్రజలు అయిష్టంతో ఉన్నా రు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయి.

- ఈవీఆర్ శెట్టి, విశ్రాంత ఉపాధ్యాయుడు, అలంపూర్ పట్టణం

నిధుల కేటాయింపులో కొరవడిన ప్రాధాన్యత

గ్రామాలు, మున్సిపాలిటీలకు అవసరమైన నిధులు కేటాయిస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో సమస్యలనుగు ర్తించడంలో వెనుకబాటు తనం కనబడుతుంది. మున్సిపాలిటీలకు సరిపడా నిధులు కేటాయించలేదు. నిధులు లేక ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. ముఖ్యంగా మున్సిపాలిటీ అంటేనే పారిశుధ్యం. పారిశుధ్య పనులకు నిధుల కేటాయింపుతోపాటు సిబ్బందికి వేతనాలు సకాలంలో చెల్లించాలి. ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతుంది.

– మనోరమ వెంకటేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అలంపూర్

మహాలక్ష్మి పథకం ఏదీ?

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు 2500 ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదు. ఈ బడ్జెట్‌లో ఈ పథకం ప్రవేశపెడతారని నిధులు కేటాయిస్తారని అనుకున్నాం. కానీ రూపాయి కూడా ఇవ్వలేదు. మహిళలకు ఒక బస్సు మాత్రమే ఇచ్చి మిగతా పథకాలాన్ని అటకెక్కించారు. ఈ జిల్లాకు చెందిన సీఎం ఉన్నాడని మురిసిన మాకు ఎలాంటి ప్రయోజనం లేదు. గ్యాస్ సిలిండర్ పథకం కొంతమందికే వస్తుంది.. 200 యూనిట్ల గృహజ్యోతి పథకం కూడా కొంతమందికి ఇస్తున్నారు. మహిళలకు మాత్రం మళ్లీ మొండిచేయి చూపించారు.

- లక్ష్మమ్మ, ఏనుగొండ మహబూబ్‌నగర్ జిల్లా

నిరాశపరిచిన బడ్జెట్

అస్లెంబ్లీలో బుధవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశ నుమిగిల్చింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మహిళల కు ప్రతినెలా రూ.2500 ఇస్తా మన్న హామీ ఊసేలేదు. ప్రభు త్వం నిర్మించి ఇస్తామన్న 4లక్షల50వేల ఇండ్లకు రూ.8వేల కోట్లు ఏమాత్రం సరిపోవు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ. 22వేల కోట్లు కేటాయిస్తేనే సరిపోతుంది. ఉపాధికి రాష్ట్ర ప్రభుత్వా టాగా పడిశాతం నిధులు కేటాయించాలి, కాని నయా పైసా కేటాయించలేదు

- గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, నారాయణపేట

అన్నివర్గాలను నిరాశ పెట్టిన బడ్జెట్

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాలను నివాశ పరిచింది. ఆరు గ్యారెంటీల అమలుకు సరిపడా నిధుల కేటాయించలేదు. పాలమూరులో జరిగిన రైతు సదస్సులో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పి ఏం కేటాయించలేదు. ఇప్పటికైనా జూటా మాటలు ఆడకుండా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

- గవినోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సామాజిక కార్యకర్త, దామరగిద్ద,నారాయణపేట జిల్లా

ఆశ కార్యకర్తల ఆక్రోశం

గద్వాల కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

- కలెక్టరేట్ గేటును తోసుకూంటూ పరుగులు
- అడ్డుకున్న పోలీసులు
- 4గంటలపాటు ధర్నా
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జేసీ చెప్పడంతో ఆందోళన విరమణ

గద్వాల, మార్చి 19: ఎన్నికల సమయంలో ఆశ కార్యకర్తల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఉదయం ఏడు గంటల నుంచి ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అధికారులు ఎవరినీ ప్రధాన గేటు వైపు నుంచి లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కలెక్టర్ తమ సమస్యలను విని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. కలెక్టర్ వారి దగ్గరకు రాకపోవడంతో ఆక్రోశించిన ఆశ కార్యకర్తలు కలెక్టరేట్ గేటును తోసుకుంటూ కలెక్టర్ చాంబర్ వైపు దూసుకెళ్లారు. అయితే వీరిని కలెక్టర్ చాంబర్ వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, సునీత, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వీవీ నర్సింహ మాట్లాడారు. ఆశ వర్కర్లకు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఆశ వర్కర్లకు రూ.18వేలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని.. ప్రభుత్వం ఏర్పాటై 15నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు హామీలను అమలు చేయడంలేదని విమర్శించారు. హామీలు అమలు చేయక పోగా సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న ఆశలపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తుందని విమర్శించారు. నేటి ధర్నాకు రాకుండా ఆశ కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టు చేశారని, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆశ వర్కర్లకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనాన్ని నిర్ణయించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావుకు అందజేశారు. వీరికి బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య మద్దతు తెలిపారు. ఆందోళనలో నర్సింహ, కాంతమ్మ, పద్మ, నాగప్రమీల, రేణుక, సునీత, శ్వేత, జయలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

- కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన

కల్వకుర్తి దవాఖాన ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

కల్వకుర్తి రూరల్, మార్చి 19 : కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలో ప్రసవం అనంతరం వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన శ్యామల(25) కుటుంబానికి న్యాయం చేయాలని బుధవారం ప్రభుత్వ దవాఖాన ఎదుట మృతురాలి కుటుంబసభ్యులు ధర్నా నిర్వహించారు. శ్యామల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్ భార్య శ్యామల ఈ నెల 17న కాన్పు కోసం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు రాగా వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఆమెను అడ్మిట్ చేసుకున్నారు. మంగళవారం శ్యామలకు రక్తం తక్కువగా ఉండడంతో జిల్లా కేంద్రం నుంచి రక్తం తీసుకురావాలని వైద్య సిబ్బంది సూచించడంతో శేఖర్ రక్తం తీసుకురావడానికి వెళ్లి వచ్చే సరికి శ్యామలకు ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ అయిన కొంత సమయానికే ఆమెకు తీవ్రంగా బ్లీడింగ్ అవ్వడంతో హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని రెఫర్ చేశారు. ఈక్రమంలో హైదరాబాద్‌కు తరలించేందుకు 108 అంబులెన్స్ ఉన్నా వాహనం డ్రైవర్ రావడంలో ఆలస్యం కావడంతో ఆమెను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే శ్యామల మృతి చెందింది. శ్యామల మృతి చెందడానికి వైద్యుల నిర్లక్ష్యం, 108 అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఈ మేరకు బుధవారం దవాఖాన ఎదుట ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సైలు మాధవరెడ్డి, మహేందర్, కురుమూర్తి, కృష్ణదేవరాయలతో పాటు పోలీస్ సిబ్బంది దవాఖాన వద్దకు చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులను నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన వైద్యసిబ్బంది నిర్లక్ష్యాన్ని బీఆర్ఎస్‌నాయకులు ఖండించారు.

జాతీయ స్థాయి ఖోఖోకు ఉపాధ్యాయురాలు ఎంపిక

మాగనూర్, మార్చి 19: ఆల్ ఇండియా సివిల్ సర్వీసు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మాగనూరు మండలకేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు దీప(ఎస్‌జీటీ) ఎంపికైనట్లు డీవైఎస్‌వో వెంకటేశ్ శెట్టి బుధవారం ప్రకటనలో తెలిపారు. జనవరి 23, 24 తేదీల్లో సికింద్రాబాద్ జింఖాన మైదానంలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ మహిళా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర జట్టు తరపున ఈనెల 21నుంచి 24వరకు ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

ఆశలన్నీ అడియాశలే..!

- పీయూకి రూ.266కోట్లు ప్రతిపాదనలు రూ.48 కోట్లతో సరిపెట్టిన ప్రభుత్వం
- సిబ్బంది వేతనాలకు సైతం సరిపోని దుస్థితి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 19 : పాలమూరు యూనివర్సిటీకి బడ్జెట్ కేటాయింపులో కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఉమ్మడి పాలమూరులో ఉన్నత విద్యకు క